సాక్షి
వికారాబాద్
మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



ట్రాన్స్‌ఫార్మర్ కోసం..

పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని ఇద్దరు రైతులు ఆందోళనకు దిగారు. 8లో▸



ఆన్‌లైన్ పనులు వద్దు

అదనపు పనులతో ఇబ్బందులు పడుతున్నా మని ఏఎన్‌ఎంలు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. 8లో▸



ఇసుక తిప్పలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లబ్ధిదారులకు భారంగా మారింది. ఇసుక అందక అవస్థలు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఉషారాణి



సీఎంతో ఉషారాణి కుటుంబ సభ్యులు

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కొడంగల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి దంపతులు సోమవారం కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో మిఠాయి రాజు, డాక్టర్ సాకేత్, డాక్టర్ శ్రావణి తదితరులు ఉన్నారు.

వసతి గృహాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న హర్ష్‌చౌదరి

కొడంగల్: పట్టణంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలు, ఎస్టీ బాలుర వసతి గృహాలను సోమవారం ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి సందర్శించారు. వాటిలో వసతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. భోజనం, మెనూ అమలు, నోటుపుస్తకాలు, యూనిఫాం తదితర వాటి గురించి ఆరా తీశారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. స్టోర్ రూం, కిచెన్, హాస్టల్ పరిసరాలను తిరిగి చూశారు. విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డీఓ పాండు, వార్డెన్లు వరలక్ష్మి, నిర్మల, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి లలితాదేవి

అనంతగిరి: దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ (అతివ ఆరోగ్య మస్తు) కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేద్దామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితా దేవి అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని జిల్లా కార్యాలయం నుంచి అన్ని పీహెచ్‌సీల వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 నుంచి మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. అలాగే రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవిత్ర, డాక్టర్ బీబీ జానీ, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ గోపాల్, డిప్యూటీ డెమో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాన్ని సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని దుకాణదారులంతా తప్పకుండా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని మున్సిపల్ అధికారులు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోని పలు దుకాణాలను సీజ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు జవాన్లతో కలిసి దుకాణాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ లైసెన్సులు తీసుకుని మున్సిపల్ అభివృద్ధికి దోహదపడా లని వారు సూచించారు. కార్యక్రమంలో ఎన్వి రాల్‌మెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, మున్సిపల్ జవాన్లు ఆశయ్య, వినోద్, బాబా, రాజు, శంకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తీరని వ్యథ..!

యూరియా కోసం రైతన్నల పాట్లు



ఎల్మకన్నె పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

- ఉదయం 6 గంటలకే ఎల్మకన్నె పీఏసీఎస్‌కు..
- భారీగా తరలివచ్చిన అన్నదాతలు
- గంటల తరబడి నిరీక్షణ
- ఒక్కొక్కరికి ఒకే బస్తా
- ఆందోళన వద్దంటున్న వ్యవసాయశాఖ

తాండూరు రూరల్/పరిగి: యూరియా సమస్య ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. ఎక్కడ చూసినా భారీ క్యూలే దర్శనమిస్తున్నాయి.. తాండూరు మండలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రస్తుతం పంటలకు యూరియా వేయాల్సి ఉండటంతో రైతులు ఫెర్టిలైజర్ దుకాణాలకు, పీఏసీఎస్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. తెల్లవారుజామునే వెళ్తున్నా బస్తా కూడా దొరక్క నిరాశతో వెనుదిరుగుతున్నారు. మండలంలోని ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయానికి సోమవారం ఉదయం 6 గంటలకే రైతులు భారీగా చేరుకున్నారు. దాదాపు 300 మంది రావడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. నాలుగు గంటల పాటు నిరీక్షించిన రైతులకు ఒక బస్తా యూరియా టోకెన్ రాసిఇచ్చారు. రైతులు పెద్ద సంఖ్యలో వచ్చిన విషయం తెలుసుకున్న



పెద్దేముల్‌లో రైతుల క్యూ

పట్టణ పోలీసులు పీఏసీఎస్ కార్యాలయానికి చేరుకొని ఒక్కొక్కరిని గేటు లోపలికి పంపారు. ఒక్కరికి ఒకే బస్తా ఇస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 4 నుంచి 5 బస్తాల అవసరం ఉందని స్పష్టం చేశారు. పలువురు ఏడీఏ కార్యాలయానికి వెళ్లి అధికారి కొమురయ్యతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం 230 బస్తాల యూరియా అందుబాటులో ఉందని క్యూలో ఉన్న ప్రతి ఒక్కరికీ పంపిణీ చేస్తామని తెలిపారు. మంగళవారం మరో 30 టన్నులు వస్తుందని ఎవరూ ఆందోళన చెందరాదని సూచించారు. దీంతో శాంతించిన ఆందోళనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పెద్దేముల్‌లో ఆందోళన

యూరియా కోసం రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘానికి యూరియా వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న అన్నదాతలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో బస్తా పంపిణీ చేశారు. చాలా మందికి యూరియా దొరకలేదు. దీంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



పరిగి ఆగ్రోస్ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

మా బాధలు పట్టవా?

యూరియా కోసం నియోజకవర్గ రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నా రైతులకు మాత్రం ఒక్క బస్తాకు మించి దొరకడం లేదు. సోమవారం పరిగి పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి యూరియా రావడంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే క్యూ కట్టారు. ఒక్క బస్తా మాత్రమే ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అదునుకు మందులు వేయక పోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మా బాధలు అధికారులు, ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు. వెంటనే సాగుకు సరిపడా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఒకే బస్తా ఇచ్చారు



ఉదయం 6 గంటలకే ఎల్మకన్నె పీఏసీఎస్‌కు చేరుకున్నా. నాలుగు బస్తాల యూరియా అవసరం ఉండగా ఒకే బస్తా ఇచ్చారు. అధికారులు స్పందించి సాగుకు సరిపడా యూరియా పంపిణీ చేయాలి.

– నేరేటి రవి, రైతు, బెల్కటూర్ గ్రామం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

స్థానిక ఎన్నికలకు సహకరించాలి

అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అదనపు కలెక్టర్ సుధీర్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓటరు లిస్ట్, పోలింగ్ కేంద్రాల జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితా సిద్ధంగా ఉందన్నారు. పోలింగ్ బూత్‌లపై అభ్యంతరా లు ఉంటే తెలియజేయాలని సూచించారు. జి ల్లాలోని 594 గ్రామ పంచాయతీల్లో 5,058 పో లింగ్ కేంద్రాలను ఎంపిక చేసినట్లు వివరించారు. 6,98,478 ఓటర్లు ఉన్నారని, ఇందులో 3,43,672 మంది పురుషులు, 3,54,790 మంది మహిళలు, 16 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీపీఓ జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో చాలా మంది రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారని వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ మంగ్లీలాల్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 83మంది వివిధ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా మండల ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని సూచించారు. డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబల కుండా చూడాలన్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎక్కిడికైనా వెళ్లాల్సి వస్తే అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డీఆర్‌ఓ మంగ్లీ లాల్, ఆర్‌డీఓ వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

విద్యా వ్యవస్థను ఉన్నతంగా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- వికారాబాద్ పట్టణంలో పలు కళాశాలల సందర్శన

అనంతగిరి: విద్యా వ్యవస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సమూల మార్పుల కోసం అధ్యయనం చేయడం జరుగుతుందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, డైట్ కళాశాలలను కమిషన్ సభ్యులు పీఎల్ విశ్వేశ్వర రావు, డాక్టర్ చారుకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు, బోధన, విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామన్నారు. అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీ సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ఇంగ్లిష్, ఉర్దూ పాఠ్యపుస్తకాలు అందుబాటు లేవని, వసతి గృహంలో సదుపాయాలు కల్పించాలని డైట్ కళాశాల విద్యార్థులు ఆకునూరి మురళిని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. వెంటనే పాఠ్యపుస్తకాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. డైట్ కళాశాల ఆవరణలో ఉన్న వసతి గృహాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహించేందుకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్ నాయక్, డీఈఓ రేణుకాదేవి, ప్రిన్సిపాళ్లు గీతా లక్ష్మీపట్నాయక్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

మా భూముల్లో ట్రిపుల్ ఆర్ వద్దు

- హెచ్‌ఎండీఏ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

పూడూరు: పచ్చటి పంట పొలాల్లో రీజినల్ రింగ్ రోడ్డు వేసి మా పొట్టలు కొట్టొద్దని మండల రైతులు కోరారు. రోడ్డు వేస్తే ఉన్న ఒక్క ఆధారం కోల్పోయి వీధిన పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పూడూరు, రాకంచర్ల తదితర గ్రామాలకు చెందిన వందల మంది రైతులు హెచ్‌ఎండీఏ కార్యాయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్ మాట్లాడుతూ.. వ్యవసాయ భూములే ముద్దు ట్రిపుల్ ఆర్ వద్దన్నారు. పాత అలైన్‌మెంట్‌ను మార్చి రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొత్త అలైన్‌మెంట్‌ను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం హెచ్‌ఎండీఏ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పటోళ్ల నర్సింహారెడ్డి, నాయకులు తాజొద్దీన్, శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, రాంచంద్రయ్య, సాయన్న, రైతులు పాల్గొన్నారు.

గంగమ్మ పైపైకి..

రికార్డు స్థాయిలో భూగర్భ జలాలు

- అధిక వర్షపాతమే కారణం
- నిండిన చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులు
- అత్యల్పం.. అత్యధికం కొడంగల్ నియోజకవర్గంలోనే..



వికారాబాద్ మండలం గెరిగెట్‌పల్లి సమీపంలో నిండుగా వ్యవసాయ బావి

వికారాబాద్: మునుపెన్నడూ లేని విధంగా ఏడాది వరుసబెట్టి కురిసిన వర్షాలకు పాతాళ గంగమ్మ పైపైకి వచ్చింది. అధిక వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులు నిండుకుండలను తలపిస్తున్నాయి. బోర్లలో నీళ్లు ఉబికి వస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి అత్యధిక వర్షపాతం నమోదైంది. పలు చోట్ల వ్యవసాయ బోరుబావుల అవసరం లేకుండానే కాలువలు, నాలాల ద్వారా పంటచేలు తడుస్తున్నాయి. జిల్లాలో 20 మండలాలు ఉండగా ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగిలిన 15 మండలాల్లో అధిక వర్షపాతం పడింది.

గ్రౌండ్ వాటర్ పరిస్థితి

జిల్లాలో ఎప్పుడూ లేనంతగా భూగర్భ జలాలు పెరిగాయి. గత ఏడాది ఇదే సీజన్‌లో సగటున 8 మీటర్ల లోతులో ఉన్న గ్రౌండ్ వాటర్ ఈ ఏడాది ఆగస్టు చివరి వరకు 6.78 మీటర్లకు (1.22 మీటర్ల పైకి) చేరింది. ప్రస్తుతం కొన్ని మండలాల్లో రెండు, మూడు మీటర్ల ఎత్తు వరకు వాటర్ లెవెల్ చేరుకుంది. కొడంగల్‌లో 2.32 మీటర్ల అత్యల్ప ఎత్తులో నీరు ఉండగా ఇదే నియోజకవర్గం పరిధిలోని దుద్యాల్ మండలంలో సగటున 18.87 మీటర్ల లోతులో నీరుండటం గమనార్హం.

సాధారణ వర్షపాతానికి మించి..

ప్రస్తుత సీజన్‌లో కురిసన అధిక వర్షాలే భూగర్భ జలాలు పెరగడానికి కారణమని అధికారులు పేర్కొంటున్నారు. నెల రోజుల క్రితమే చెరువులన్నీ పొంగిపొర్లాయి. జూన్ మొదటి వారం నుంచి సాధారణ వర్షపాతం 485 మిల్లీమీటర్లు నమోదు కాగా ఇప్పటి వరకు 648 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 1,179 చెరువులు ఉండగా అన్నీ నిండాయి. 800 చెరువులు అలుగు పారుతున్నాయి. చాలా చోట్ల ఫీడర్ చానల్స్ సరిగ్గా లేకపోవడం, ఆక్రమణలకు గురికావడంతో కొన్ని చెరువులు అలుగు పారడంలేదు. ప్రధాన ప్రాజెక్టులు సైతం నీటితో కళకళలాడుతున్నాయి. జుంటుపల్లి, కోట్‌పల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి, శివసాగర్, కాకరవాగు నిండుకుండలా మారాయి.

గణనీయంగా పెరిగాయి

గత ఏడాదితో పోలిస్తే ఈ సారి భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. రెండేళ్లుగా క్రమంగా పెరుగుతున్నాయి. వర్షపు నీరు వృథాగా దిగువకు పోకుండా కాపాడుకోవాలి. భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉంది.

– రవిశంకర్, భూగర్భ జలవనరుల శాఖ ఏడీ

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ ఆర్‌డీఓ సరితను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని నెరవేర్చాలని అన్నారు. రైతులకు కావాల్సిన యూరియాను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బుద్దుల జంగయ్య, రమేష్ యాదవ్, దామోదర్‌రెడ్డి,వెంకటయ్య, షేక్ ఉస్మాన్, కిష్టయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంచే వరకు వదలం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆనంద్, మల్లికార్జున్

అనంతగిరి: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం వెంటనే పెన్షన్లను పెంచాలని లేకుంటే వెంట పడుతూనే ఉంటామని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆనంద్, మల్లికార్జున్ అన్నారు. సోమవారం పింఛను మొత్తం పెంచాలని కోరుతూ వికారాబాద్‌లోని కలెక్టరేట్ ఎదుట వృద్ధులు, వితంతువులు, వికలాంగులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు, ఆసరా పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండేళ్లు కావస్తున్న ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ వెంటనే పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ నిత్యావసరాల ధరలు పెరుగుతున్నా పెన్షన్‌ను మాత్రం పెంచడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్, చేయూత పెన్షన్ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మంజులారెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రామకృష్ణ, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాసు, నాయకులు సుభాష్, ప్రకాష్, నరసింహ, దప్పు మహేందర్, శివాజీ, రవీందర్, పుష్పరాణి, సునీత పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రోడ్లను అభివృద్ధి చేయండి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు:తాండూరు నియోజకవర్గంలోని రోడ్లను అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. సోమవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి ఈ మేరకు విన్నవించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితిని వివరించారు. స్పందించిన మంత్రి ఆర్‌అండ్‌బీ సీఈకి ఫోన్ చేసి తాండూరులో రోడ్ల అభివృద్ధికి సహకరించాలని ఆదేశించారు.



ఆర్‌అండ్‌బీ సీఈతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

క్లుప్తంగా

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు


పైప్‌లైన్ మరమ్మతు పనులు చేస్తున్న భగీరథ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్, ఆలేడ్ గ్రామాలకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోంది. దీంతో ఐదు రోజుల పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు సోమవారం పైప్‌లైన్ లీకేజీని సరి చేశారు. మిషన్ భగీరథ ఏఈఈ హర్షిత్‌రెడ్డి, సిబ్బందితో వచ్చి సమస్యను పరిష్కరించారు. దీంతో ఆయా జీపీలకు యథావిధిగా నీటి సరఫరా పునఃప్రారంభమైంది.

టీహెచ్ కాలేజీపై చర్యలు తీసుకోండి


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తాండూరు టౌన్: పట్టణంలో ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న టీహెచ్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సంఘం నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియేట్ నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అడ్మిషన్లు తీసుకుని విద్యార్థులు, తల్లిదండ్రులను మోసగిస్తున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా నోడల్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోదన్నారు. ఆయన వెంట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

భార్యను వేధించిన భర్తకు జైలు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సరోజు

అనంతగిరి: భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ కొడంగల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీరాం తీర్పు వెల్లడించారని మహిళా పీఎస్ సీఐ బి.సరోజ తెలిపిన వివరాల ప్రకారం.. లగచర్ల గ్రామానికి చెందిన చౌదర్‌పల్లి సుజాత అదనపు వరకట్నం కోసం వేధిస్తున్నారని 2019 ఆగస్టు 10న భర్త, అత్తమామలపై ఫిర్యాదు చేసింది. వీరికి పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించిన ఎస్ఐ శ్రీకాంత్, అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో పరిశీలించిన న్యాయమూర్తి పైతీర్పు వెల్లడించారు. నేరస్తునికి శిక్ష పడేలా చూసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్ రామకృష్ణను సీఐ సరోజ అభినందించారు.

మాజీ మంత్రి మాణిక్‌రావుకు నివాళి

తాండూరు: తాండూరు ప్రాంత కీర్తి ప్రతిష్టలను జాతీయ స్థాయిలో నిలబెట్టిన ఘనత మాజీ మంత్రి మాణిక్‌రావుకు దక్కుతోందని రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడు రమేశ్ మహరాజ్ అన్నారు. సోమవారం పట్టణంలోని మల్లప్ప మడిగె వద్ద ఉన్న మాణిక్‌రావు విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరోవైపు మాణిక్‌రావు సతీమణి శశిప్రభ, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, మాజీ మంత్రి చిన్నారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ సైతం వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


మనోజ్ (ఫైల్)

అనంతగిరి: మూడు రోజుల క్రితం తప్పిపోయిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బొంరాస్‌పేట మండలం మెట్లకుంటకు చెందిన ఎస్.మనోజ్(32)కు భార్య రమాదేవి, ఓ బాలుడి ఉన్నాడు. ఈ నెల 4న మనోజ్ వికారాబాద్ పట్టణంలో శుభకార్యానికి హాజరై బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో భార్య మరుసటి రోజు వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా ఆదివారం రాత్రి ఆలంపల్లి సమీపంలోని రైలు పట్టాల పక్కన మనోజ్ మృతదేహం పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యూరియా కావాలంటే!

కావాల్సినంత యూరియా దొరకక తిప్పలు పడుతున్న అన్నదాతలకు ఫర్టిలైజర్ షాపుల యజమానుల షరతులు పెనుభారంగా మారుతున్నాయి. యూరియా కోసం తప్పనిసరిగా బయో, లాప గుళికలు కొనాలని ఒత్తిడి తేవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- బయో, లాప గుళికలు కొనాలని షరతు
- కొరతను ఆసరా చేసుకొని వ్యాపారుల ఆగడాలు
- రైతులపై అదనపు భారం మోపుతున్న వైనం
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 324 దుకాణాలు


జిల్లాలోని ఓ దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎరువులు


క్రిమి సంహారక మందులు

దుద్యాల్: ఓ వైపు రైతుకు సరిపడా యూరియా అందక విలవిలలాడుతుంటే.. కొందరు వ్యాపారులు వారి అవసరాలను ఆసరాగా చేసుకుని ఇష్టారీతిన వ్యాపారం చేస్తున్నారు. ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న పంటకు యూరియా, డీఏపీ ఎరువులు అందించాల్సి ఉంది. ఇదే అదనుగా భావించిన ఫర్టిలైజర్ షాపుల యజమానులు యూరియా కావాలంటే బయో ఉత్పత్తులు, లాప గుళికలు, క్రిమి సంహారక మందులు కొనాలని షరతులు పెడుతున్నారు. ఇదే విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ఫర్టిలైజర్ షాప్‌లు, మన గ్రోమోర్‌లు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలల్లో

జిల్లాలో దుకాణల వివరాలు

ఆగ్రోస్ రైతు సేవాకేంద్రాలు	24
డీసీఎంఎస్	26
పీఏసీఎస్	14
ఎఫ్‌పీసీఎస్	01
హెచ్‌ఏసీఏ(హాకా)	01
మన గ్రోమోర్	08
ప్రైవేట్ ఫర్టిలైజర్స్	245

ఎరువులు, క్రిమి సంహారక మందులు అందుబాటులో ఉంటున్నాయి. కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు సైతం గుట్టు చప్పుడు కాకుండా వ్యాపారాలు చేసుకుంటున్నారు.

సరఫరా ఇలా..

ప్రభుత్వం ప్రైవేట్ ఫర్టిలైజర్, ప్రభుత్వ అనుసంధాన ఫర్టిలైజర్ దుకాణాలకు విరివిగా అందిస్తుంది. ప్రభుత్వం అనుసంధాన షాపులైన ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు,(డీసీఎంఎస్, పీఏసీఎస్, ఎఫ్‌పీసీఎస్, హాకా) సొసైటీలకు 60 శాతం యూరియా సరఫరా కాగా మిగిలిన 40 శాతం ప్రైవేట్ షాపులకు సరఫరా చేస్తారు.

చర్యలు తీసుకుంటాం



ఎరువులు, క్రిమిసంహారక మందులు అమ్ముతున్న ఏ యాజమాన్యమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులతో పాటు బయో ఉత్పత్తులు, లాప గుళికలు తప్పనిసరిగా అంటగట్టొద్దు. తమకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. నిజమని తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రైతులకు కావాల్సిన ఎరువులను సరైన ధరకే అమ్మాలి.

– రాజారత్నం, జిల్లా వ్యవసాయ అధికారి

ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఆందోళన

- పది రోజులుగా తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- విద్యుత్ కార్యాలయ గేటుకు ట్రాక్టర్ అడ్డం పెట్టి రైతుల నిరసన


విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

తాండూరు టౌన్: పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని ఇద్దరు రైతులు తాండూరు పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన రైతుల పంట పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పది రోజుల క్రితం పాడైపోయింది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కావాలని పలుమార్లు విద్యుత్ ఏఈ, లైన్‌మెన్‌ను ప్రాధేయపడినా వారు పట్టించుకోలేదు. సోమవారం పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లో వేసుకుని తాండూరులోని విద్యుత్ కార్యాలయం వద్దకు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే నిరసనకు దిగారు. చివరికి అధికారులు ఈరోజు కుదరదు, మరో రోజు రావాలని చెప్పారు. దీంతో ఆగ్రహించిన రైతులిద్దరూ ట్రాక్టర్‌ను కార్యాలయ గేటుకు అడ్డంగా పెట్టి ఆందోళనకు దిగారు. పది రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో పంట చేను ఎండిపోతోందని, విద్యుత్ అధికారులను బతిమిలాడినా వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. రైతులకు పోలీసులు, విద్యుత్ సిబ్బంది నచ్చజెప్పి, ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్‌యాదవ్


పోలేపల్లిలో మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీందర్‌యాదవ్

దుద్యాల్: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్ సూచించారు. మండల పరిధిలోని పోలేపల్లిలో కొనసాగుతున్న ప్రభుత్వ మెడికల్ క్యాంపును సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులను అజాగ్రత్త చేయొద్దని తెలిపారు. గ్రామంలో వ్యాధులు ప్రబలుతున్నాయనే సమాచారంతో మూడు రోజుల పాటు మెడికల్ క్యాంప్ నిర్వహించామన్నారు. సుమారు 200 మంది జ్వరం, జలుబు, దగ్గుతో బాధ పడుతున్నారని స్పష్టంచేశారు. కార్యక్రమంలో డాక్టర్ వందన, విద్య పాల్గొన్నారు.

లంబాడాలపై అసత్య ప్రచారం


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్

మోమిన్‌పేట: ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని అసత్య ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావులను కాంగ్రెస్ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారా, లంబాడీలు సింధు నాగరికత కాలం నుంచి గిరిజనులుగా గుర్తింపు పొందారన్నారు. బ్రిటిష్ పాలకులు సైతం 1871లోనే క్రిమినల్ ట్రైబ్స్ జాబితాలో చేర్చారని చెప్పారు. కుట్రపూరితంగా లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని రిట్ పిటిషన్ దాఖలు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోర్‌సేన జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌నాయక్, నాయకులు రవీందర్, కాశీరాం, దీప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల్లో.. రాయ‘భేరాలు’!

- పెట్టీ కేసుతో సరిపెట్టిన పోలీసులు
- పట్టుకున్న ఐదుగురినీ వదిలేసిన వైనం

బషీరాబాద్: గుప్త నిధుల కేసులో గూడుపుఠానీ చోటుచేసుకుంది. గత ఆదివారం గ్రహణం రోజున నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన వారంతా సంపన్నులు కావడంతో పోలీసులు భేరసారాలు జరిపారు. కేసు విషయంలో మొదట హడావుడి చేసి, తెల్లారేసరికి తుస్సుమనిపించారు. నిధుల వేట చేపట్టిన ఘటనాస్థలంలో పట్టుబడిన యాగ ప్రశాంత్, పట్నం శ్రీనివాస్, మోహిజ్, మహేశ్, శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును విచారించిన ఓ పోలీసు అధికారి వీరిని పీఎస్‌లోని గది తలుపులు మూసి రహస్యంగా విచారణ చేపట్టారు. ఆ ఐదుగురినీ కుర్చీల్లో కూర్చోబెట్టి రాచమర్యాదలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని మీడియా బహిర్గతం చేయడంతో.. విచారణ పేరుతో మరో ఠాణాకు తరలించి, అక్కడ రాయ్జభేరాలు₹ నడిపినట్లు తెలిసింది. మీడియాలో ఫొటోలు రాకుండా, కేసు తీవ్రత లేకుండా చేసేందుకు రూ.1.50 లక్షలకు డీల్ కుదిరిందనే విషయం బయటకు పొక్కింది. ఇందులో భాగంగా ఓ పోలీసు అధికారికి రూ.60 వేలు ముట్టజెప్పినట్లు సమాచారం. మరోవైపు పెద్ద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించిన పోలీసులు బేరం కుదరడంతో పెట్టీ కేసుతో సరిపెట్టి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. పట్టుకున్న ఐదుగురినీ సోమవారం రాత్రి వదిలేశారు. ఈ విషయమై ఎస్ఐ నుమాన్‌అలీని వివరణ కోరగా.. సదరు వ్యక్తులకు నోటీసులు ఇచ్చి పంపించేశామని, మిగిలిన విషయాలేవీ తనకు తెలియదని చెప్పారు.

ఆ స్తంభాలను తొలగించండి



నిరసన వ్యక్తం చేస్తున్న మల్లప్ప

- లేదంటే ఆత్మహత్య చేసుకుంటా
- సబ్‌స్టేషన్ ఎదుట రైతు ఆందోళన

మంచాల: తమ పొలంలో నాటిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఓ రైతు సోమవారం పెట్రోల్ డబ్బాతో సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి జాపాల గ్రామానికి చెందిన బక్కన మల్లప్పకు చెందిన వ్యవసాయ పొలం నుంచి శనివారం ప్రక్క రైతు వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ నిమిత్తం విద్యుత్ స్తంభాలను అమర్చారు. విషయం తెలుసుకున్న మల్లప్ప.. తమకు సమాచారం ఇవ్వకుండా పొలంలో స్తంభాలు ఎలా ఏర్పాటు చేశారని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఏఈ బాజీసింగ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆ పోల్స్‌ను తొలగిస్తామని హామీ ఇచ్చాడు. రెండు రోజులు అయినా వాటిని తొలగించలేదని పేర్కొంటూ.. తాజాగా బాధిత రైతు నిరసన వ్యక్తం చేశారు. వాటిని తీయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. లేబర్ రాగానే మంగళవారం ఉదయం ఆ స్తంభాలను తొలగిస్తామని బాధిత రైతుకు హామీ ఇచ్చారు. అయినా సదరు వ్యక్తి వినకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

బైకుల దొంగల అరెస్టు

- నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ లక్ష్మీనారాయణ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్‌రూరల్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకులను దొంగతనం చేస్తున్న ఇద్దరిని సోమవారం షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం దావుద్‌గూడ తండాకు చెందిన శివ, కొత్తూరు మండలం కొడిచర్ల గ్రామానికి చెందిన బ్యాగరి రాంచందర్‌లు స్నేహితులు. వీరు షాద్‌నగర్ ఠాఫా పరిసర ప్రాంతాల్లోని ఇళ్ల ఎదుట పార్కింగ్ చేసిన బైకులను అపహరిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లుకు చెందిన ద్విచక్ర వాహనం జూలై నెలలో చోరీకి గురైంది. ఇదే విషయమై సదరు బాధితుడి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బైకు దొంగలను గుర్తించారు. నిందితుల నుంచి సుమారు రూ.2 లక్షల విలువ చేసే 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా కేసు ఛేదించిన సీఐ విజయ్‌కుమార్, డీఎస్ఐ శివారెడ్డి, కానిస్టేబుళ్లు రవీందర్, సంతోష్, కరుణాకర్, జాకీర్‌లను ఏసీపీ అభినందించి, రివార్డులు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

సంపు మోటార్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదం

కుల్కచర్ల: విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చెల్లాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగంపల్లి విజయలక్ష్మి(36) ఆదివారం రాత్రి 8:30 గంటలకు స్నానం చేసేందుకు సంపు మోటార్‌ను ఆన్‌చేస్తుండగా షాక్‌కు గురై సంపులో పడిపోయింది. కొద్ది సేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రేమ వేధింపులతో బాలిక బలన్మరణం

నవాబుపేట: ప్రేమ వేధింపులకు బాలిక బలై ంది. ఈ సంఘటన తిమ్మారెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీవాణి (17) నవాబుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ రెండో సంవత్సరం చదువుతోంది. ఇదే ఊరికి చెందిన ఆటో డ్రైవర్ ప్రశాంత్ ప్రేమ పేరుతో ఏడాదిగా ఆమెను వేధిస్తున్నాడు. బాలిక కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, స్నేహితులు హెచ్చరించినా అతనిలో మార్పు రాలేదు. తరచూ బాలిక కాలేజీ వద్దకు వెళ్లి ఇబ్బంది పెడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం రాత్రి పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలిక మృతిచెందినట్లు నిర్ధారించారు. వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో మాస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పుండ్లిక్ తెలిపారు.

జర్నలిస్టులపై దాడులను సహించం

నందిగామ: జర్నలిస్టు సందీప్‌పై అకారణంగా దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులపై దాడులు చేస్తే ఎంతటి వారైన సహించేది లేదని టీయూడబ్ల్యూఎఫ్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. మండలానికి చెందిన జర్నలిస్టు సందీప్‌పై నందిగామకు చెందిన కొంత మంది యువకులు గణేశ్ నిమజ్జనం రోజు మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చారు. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ జర్నలిస్టులు సోమవారం పెద్దఎత్తున నందిగామ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌తో వారు మాట్లాడుతూ.. అధికార పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి సూచనల మేరకు కొంత మంది యువకులు జర్నలిస్టు సందీప్‌పై అకారణంగా దాడి చేశారన్నారు. దాడి జరిగి రెండు రోజులైనా కూడా నేటి వరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. కేసు విచారణ జరుపుతున్నామని, నిజానిజాలు తెలుసుకొని దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు ఖాజా పాషా, నరేశ్, లక్కాకుల రమేశ్, ఆంజనేయులుగౌడ్, నర్సింహారెడ్డి, యాదయ్య, వెంకన్న బాబు, చంద్రశేఖర్, నూరోద్దీన్, జగన్, మధుసూదన్ గౌడ్, శ్రీహరి పాల్గొన్నారు.

మొండి బకాయిలపై చర్యలు

- బంట్వారం పరిధిలో రూ.5.32 కోట్ల పెండింగ్
- సహకార సంఘం జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచంద్రరావు


మాట్లాడుతున్న జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచంద్రరావు

బంట్వారం: దీర్ఘకాలిక రుణాలు చెల్లించని మొండి బకాయిదారులపై చర్యలకు సిద్ధమవుతున్నామని హైదరాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జాయింట్ రిజిస్ట్రార్ (ఓఎస్‌డీ) సూర్యచంద్రరావు అన్నారు. బంట్వారం సహకార సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఘం పరిధిలో రూ.5.32 కోట్ల రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే నోటీసులు జారీ అయిన సుమారు యాభై మంది రైతులను కలిశామని తెలిపారు. వీరిలో ఇద్దరు లోన్ క్లియర్ చేయగా, మిగిలినవారు పంటలు చేతికి వచ్చాక అప్పు చెల్లిస్తామని సమాధానం చెప్పారన్నారు. మరో 300 మంది రైతుల నుంచి ఓవర్‌డ్యూ ఉందన్నారు. వీరందరికీ త్వరలోనే నోటీసులు జారీ చేసి, రికవరీ చర్యలు చేపడుతామని స్పష్టంచేశారు. నోటీసులు అందుకున్న మొండిబకాయిదారుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్టీ రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలు చెల్లించకపోతే ఎక్కువ వడ్డీ పడుతుందని తెలిపారు. తీసుకున్న రుణాలను వాయిదాల ప్రకారం చెల్లిస్తే నష్టం ఉండదన్నారు. పెండింగ్ లోన్లను సత్వరమే చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ అక్షత్, మోమిన్‌పేట బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పనులు అప్పగించొద్దు


పీహెచ్‌సీ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

పీహెచ్‌సీ ఎదుట బైఠాయించిన ఏఎన్‌ఎంలు

బొంరాస్‌పేట: ఆన్‌లైన్ పనులు అదనపు భారంగా మరుతుందని ఏఎన్‌ఎంలను మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. కొంత కాలంగా ఎన్‌సీడీ ప్రోగ్రామ్‌లో ఏఎన్‌ఎంలతో స్క్రీనింగ్ టెస్టులతో పాటు ఆఫ్‌లైన్ రిపోర్టులు చేయిస్తున్నారు. తాజాగా ఆన్‌లైన్ కూడా చేయాలని ఒత్తిడి పెంచడం సమంజసం కాదన్నారు. పని ఒత్తిడి కారణంగా మానసిక, శారీరక రుగ్మతలకు గురౌతున్నామని వాపోయారు. క్షేత్రస్థాయి పనులతోపాటు ఆన్‌లైన్ పనులు చేయలేమంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఎన్‌సీడీ ప్రోగ్రామ్‌లో ఆన్‌లైన్ పనులకు ఏఎన్‌ఎంలను మినహాయించాలని కోరారు. ఇందులో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు లీలావతి, హైమావతి, అంజలి, శ్రీలత, పుష్పలత, పద్మ, రాములమ్మ తదితరులు వైద్యాధికారి హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు విస్తరణ అడ్డగింత

- దుకాణాలు, ఇళ్లు తొలగించొద్దు
- ప్రభుత్వ జాగలో నుంచి రహదారి వేయండి
- ఆర్అండ్‌బీ అధికారులకు బాధితుల విజ్ఞప్తి


రోడ్డు విస్తరణ పనులు అడ్డుకుంటున్న బాధితులు

బషీరాబాద్: రహదారి విస్తరణ పనుల కోసం తమ దుకాణాలు, ఇళ్లు కూలగొట్టితే కుటుంబాలు రోడ్డున పడతాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.30 కోట్లతో బషీరాబాద్–జీవన్గీ రోడ్డు విస్తరణలో భాగంగా మండల కేంద్రంలోని రైల్వేగేటు నుంచి గోసాయికాలనీ పోచమ్మ ఆలయం వరకు 1.2 కి.మీ మేర 43 ఫీట్లకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు మధ్యలో నుంచి రెండు వైపులా 27ఫీట్ల వరకు విస్తరణ జరుగుతుంది. దీంతో తమ దుకాణాలు, ఇళ్లు కోల్పోతున్నామని బషీరాబాద్‌కు చెందిన బాధితులు ప్రదీప్, ఫయాజ్, జయంత్, హోటల్ రాములు, తుకారాం, నర్సిములు, దీపక్, రాజన్న కులకర్ణి, రఘు, సునీల్, సురేష్, రామ్‌చందర్, తుల్జారామ్‌గౌడ్, పాష, పవాన్ ఠాకూర్, సాయిలేగౌడ్, ప్రమోద్, శ్రవణ్ సోమవారం రోడ్డు పనులను అడ్డుకున్నారు. వీరికి స్థానిక కాంగ్రెస్ నేతలు మద్దతుగా నిలిచారు. దీంతో పనులు ఆగిపోయాయి.

ఉన్నతాధికారులతో చర్చించి..

విషయం తెలుసుకున్న ఆర్అండ్‌బీ ఏఈ రిషీవరుణ్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. రోడ్డుకు మరో వైపు ప్రభుత్వ పాడుబడిన భవనాలు ఉన్నాయని అటు నుంచి రెండు మీటర్లు కొలత తీసుకోవాలని కోరారు. తద్వారా తమ షాపులు, ఇళ్లకు నష్టం జరుగకుండా ఉంటుందని మొరపెట్టుకున్నారు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు మరోసారి రోడ్డు కొలతలు తీసుకున్నారు. ఇదే విషయమై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఏఈ వారికి భరోసా ఇచ్చారు. అనంతరం రోడ్డు మధ్య భాగంలోనే తవ్వకాల పనులు ప్రారంభమయ్యాయి.

నష్టం జరగకుండా విస్తరణ

ప్రజల ఇళ్లు, షాపుల నిర్మాణాలు కూల్చకుండానే రోడ్డు పనులు చేపడుతున్నాం. ఎవరు ఆందోళన చెందవద్దు. అయితే షాపులు, ఇళ్ల ముందు ఉన్న ర్యాంపులు, మెట్లు తొలగించబడుతాయి. బాధితుల ఆందోళనతో రోడ్డు విస్తరణను తాత్కాలికంగా నిలిపేశాం. ఉన్నతాధికారులతో చర్చించి ఎవరికి ఇబ్బందులు కలిగించకుండా చూస్తాం.

– రుషీవరుణ్, ఏఈ, ఆర్అండ్‌బీ